

ఏరువాక సాగారో...

జ్యేష్ఠ మాస పౌర్ణమి(ఏరువాక పౌర్ణమి) సందర్భంగా జిల్లా రైతులు బుధవారం సాగు పనులను మొదలుపెట్టారు. ఉదయమే పశువులు, నాగళ్లు, ట్రాక్టర్లతో పొలాలకు చేరుకుని పూజలు చేశారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండలో పీఏసీఎస్ చైర్మన్ మందడపు సుధాకర్ పలువురు రైతులతో కలిసి పూజలు చేయడమేకాక మహిళలకు సారె పెట్టి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. నీటి సంఘం మాజీ చైర్మన్ మాధవరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, బాలు తదితరులు పాల్గొన్నారు. ఇక నేలకొండపల్లి, తల్లాడ సహా ఇతర మండలాల్లో కూడా పెద్దసంఖ్యలో రైతులు దుక్కులు దున్ని సాగు పనులు మొదలుపెట్టారు. – రఘునాథపాలెం

న్యూస్‌రీల్

టీజీ-ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ ఈసీఈటీ) ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఈనెల 14నుంచి 18వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉండగా, తమ కళాశాల ప్రాంగణంలో 17నుంచి 19వ తేదీ వరకు జరిగే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఆతర్వాత 17 నుండి 21వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇస్తే, 25వ తేదీన సీట్లు ఖరారవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సమయపాలన తప్పనిసరి



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న రామారావు

ముదిగొండ: వైద్య, ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు ఆదేశించారు. ముదిగొండలోని పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించాక మాట్లాడారు. ల్యాబ్‌లో అన్ని నిర్వహిస్తూ, అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వైద్యాధికారి అరుణాదేవి, ఉద్యోగులు లత, సత్యవతి, నాగరాజకుమారి పాల్గొన్నారు.

సాంకేతికతను జోడిస్తే అధిక దిగుబడి



రైతులతో శాస్త్రవేత్తలు, అధికారులు

కూసుమంచి: రైతులు వ్యవసాయంలో సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగిస్తే అధిక దిగుబడులు పొందొచ్చని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.పద్మావతి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని భగవత్‌వీడులో రైతులకు బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఖరీఫ్ పంటల సాగులో ఆధునిక పద్ధతులు, వరి నూతన వంగడాలు, వాటితో ఉపయోగాలను వివరించి, కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త అక్షిత్, ప్రోగ్రాం అసిస్టెంట్ నరేష్, ఏఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

బడికి పేరు.. టీచర్లకు గౌరవం



:.. ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్ ..:

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించడం ద్వారా బడికి పేరు, ఉపాధ్యాయులకు గౌరవం దక్కేలా చేస్తాం. సాధారణ బోధన విధానం స్థానంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను వినియోగంలోకి తీసుకొచ్చాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా బడిబాటను నిర్వహిస్తూ బోధన, వసతులు, వచ్చిన ఫలితాలను తెలియజేస్తున్నాం. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలనూ పునఃప్రారంభించే దిశగా కృషి జరుగుతోంది. ప్రైవేట్ పాఠశాలల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలల ఫలితాలపై విస్తృతంగా ప్రచారం చేస్తాం' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. విద్యాసంవత్సరం గురువారం ప్రారంభం కానున్న నేపథ్యాన ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, కల్పిస్తున్న వసతులు, ఇతర అంశాలపై బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కలెక్టర్ వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

- తల్లిదండ్రులు, యంత్రాంగం కలిస్తేనే విద్యావ్యవస్థలో మార్పు
- పాఠశాలల్లో వసతులు.. ఏఐ ద్వారా బోధన
- ఇక నుంచి ప్రభుత్వ స్కూళ్లలో ఫలితాలపై ప్రచారం
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విద్యార్థుల సంఖ్య పెంచేలా..

బడిబాట ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా పనిచేశాం. తల్లిదండ్రులతో మాట్లాడినప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలు తెలిశాయి. ఒకటి ఇంగ్లిష్ బోధన, రెండోది మౌలిక వసతుల కొరతను చెప్పారు. ప్రధానంగా బాలికలకు టాయిలెట్లు కొరత ఉందని తేలడంతో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద రూ.30 కోట్ల నిధులతో బాలికల టాయిలెట్లు, కిచెన్‌షెడ్ నిర్మాణాలు చేపట్టాం. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా 34 స్కూళ్లలో ఉయ్ కెన్ లెర్న్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయించాం. ఈసారి ఆ సంఖ్య 205కు పెంచుతున్నాం.

ఫలితాలపై ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత ఏడెనిమిది ఏళ్ల నుంచి 95 శాతం ఉంటోంది. అదే ప్రైవేట్‌లో 90 – 91 శాతం దాటడం లేదు. ఈ విషయమై తల్లిదండ్రులకు వివరిస్తూ 560, 570 మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో స్కూళ్ల ఎదుట హోర్డింగ్‌లు పెడతాం. 'మాకు ఒక ఏడాది అవకాశం ఇవ్వండి.. మీ నమ్మకాన్ని గెలవలేకపోతే ప్రైవేట్ పాఠశాలలకు పంపండి' అని చెబుతున్నాం.

ఆ పాఠశాలలను గుర్తించాం..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిస్తే విద్యావ్యవస్థను మార్చొచ్చు. అందుకోసం ప్రభుత్వ పాఠశాలలకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. కొన్ని పాఠశాలలకు రవాణా సౌకర్యం లేకపోవడం వంటి కారణాలతో విద్యార్థులు రావడం లేదని తెలిసింది. కేవలం రవాణా సమస్యతో విద్యార్థులు తగ్గిన ఐదారు పాఠశాలలను గుర్తించి వాహనాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఉన్న 21 భవిత సెంటర్లకు కూడా ఆటో సదుపాయం కల్పిస్తాం.

ఏఐ బోధనతో సత్ఫలితాలు

జిల్లాలో పైలట్‌గా ఏడు పాఠశాలల్లో ఐఏ ద్వారా బోధించగా.. విద్యార్థుల స్థాయి ఆధారంగా అర్థమయ్యేందుకు ఉపయోగపడింది. దీంతో ఈ ఏడాది 176 పాఠశాలల్లో ఏఐ విధానాన్ని అమలుచేస్తున్నాం. తద్వారా విద్యార్థి స్థాయిని గుర్తిస్తూ, మెరుగైన బోధనకు అవకాశం కలుగుతోంది. విద్యార్థుల స్థాయిపై నెలవారీ నివేదికలు రూపొందించి సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు పనిచేస్తారు.

ప్రోత్సాహం.. చర్యలు

పాఠశాలలు కొనసాగాలంటే విద్యార్థులు ఉండాల్సిందేనన్న అంశంపై ఉపాధ్యాయులకు వివరించాం. ప్రవేశాలు పెంచిన ఉపాధ్యాయులకు మంచి పోస్టింగ్ ఇవ్వడమే కాక కావాల్సిన వసతులు కల్పిస్తాం. ఇదే సమయాన ఎన్‌రోల్‌మెంట్ పెంచని ఉపాధ్యాయులపై చర్యలు ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో గ్రామస్తులు మెచ్చుకునేలా ఉపాధ్యాయులు పనిచేస్తున్నప్పుడు మిగిలిన చోట్ల ఎందుకు జరగడం లేదు. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు కూడా అంగీకరించారు. పాఠశాల దూరంగా ఉండటం, టీచర్లు రాకపోవడం, వసతులు లేకపోవడం వంటి కారణాలతో జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు 65 వరకు చేరాయి. వీటన్నింటినీ తెరిచేలా చర్యలు తీసుకుంటున్నాం.

నేను 12 స్కూళ్లు మారాను..

విద్యార్థికి నేర్చుకోవాలనే తపన ఉండాలి. నేను పదేళ్లలో 12 స్కూళ్లు మారాను. ప్రతీ చోట కొత్త స్కూల్, కొత్త ఫ్రెండ్స్, టీచర్లు ఉండేవారు. టాప్ మార్కులు రాకపోగా 6 – 8 ర్యాంకుల్లో ఉండేవాడిని. కానీ మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో చదువుతోనే ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ పోటీ పడే ధైర్యం వచ్చింది. చదవడం ద్వారా మార్కులు రావొచ్చు, రాకపోవచ్చు కానీ ఏదో ఒకటి నేర్చుకునే అలవాటు ఏర్పడుతుంది. ఇది జీవితంలో ఎదగడానికి ఉపయోగపడుతుంది. అందుకే ఇష్టంతో చదువుకునేలా చేయాలి. కొత్త విషయాన్ని తెలుసుకున్నామనే తృప్తి కలగాలి. అలాంటప్పుడే జీవితంలో ఎదగగలం.

బడి.. జ్ఞాపకాల ఒడి



ఆవాసాలకు దూరంగా ప్రభుత్వ పాఠశాలలు.. అక్కడ కూడా అరకొర వసతులు.. ప్రైవేట్ పాఠశాలలు అందుబాటులో ఉన్నా అందులో చదివే స్థోమత లేక ఇబ్బందులు.. ఈ సమస్యలు వేధిస్తున్నా.. చదవాలనే తపనకు తోడు గురువుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరిన వారెందరో ఉన్నారు. నేడు కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లాలో పలువురు ప్రముఖులను పలకరించగా.. వారి పాఠశాల జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆ వివరాలు 'సాక్షి' పాఠకుల కోసం..

ప్రభుత్వ బడిలో చదివే ఎదిగా...



ఖమ్మం సహకారనగర్: మాది ఖమ్మం రూరల్ మండలం పొలిశెట్టిగూడెం. వ్యవసాయం చేసే తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో చదువుతూ 1991–92 బ్యాచ్‌లో పదో తరగతి పూర్తి చేశా. నాడు కనీస సౌకర్యాలు లేకపోగా స్వగ్రామం నుంచి ఖమ్మం రావడానికి ఇబ్బందులు పడ్డా. హాస్టల్‌లో ఉంటూ చదివి ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ స్థాయికి ఎదగడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన గదులు ఉండగా, ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందుతున్నాయి. ఈవిషయాన్ని తల్లిదండ్రులు గమనించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

– కందిమళ్ల లింగయ్య, విద్యాశాఖ ఏడీ

అన్నయ్యలతో కలిసి పాఠశాలకు..



ఖమ్మంమయూరిసెంటర్: నేను 1–5వ తరగతి వరకు స్వస్థలమైన వైరా మండలం కొండకొడిమ పీఎస్‌లో, 6–10వ తరగతి వరకు మా నాన్న సూర్యనారాయణ ఉపాధ్యాయుడిగా పని చేసిన రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్తిచేశా. ఇద్దరు అన్నయ్యలతో కలిసి స్కూల్‌కు వెళ్లేవాడిని. వేసవి సెలవులు వచ్చాయంటే ఇంటి వద్ద పొలం పనులకు వెళ్లేవాడిని. సెలవుల్లో ఎంత సరదాగా గడిపినా.. పాఠశాల పునఃప్రారంభం రోజునే వెళ్లేలా అమ్మ ప్రోత్సహించేది. సెలవుల్లో ఏమేం చేశామో తొలి రోజు స్నేహితులు, టీచర్లతో చెప్పేవాళ్లం. మా అన్నయ్యలు నాగకోటేశ్వరరావు, వెంకటేశ్వరరావుతో కలిసి స్కూల్‌కు వెళ్లిన రోజులు గుర్తుకొస్తుంటాయి.



సోదరులతో సత్యనారాయణ (ఎడమ చివర)

– కె.సత్యనారాయణ, ఎస్సీ డీడీ

నాన్న చేయి పట్టుకుని వెళ్లా..



వైరా: తొలి రోజు పాఠశాల అనుభవం ఇంకా మరిచిపోలేదు. పాఠశాల ప్రారంభం రోజున నాన్న నా చేయి పట్టుకుని తీసుకెళ్లారు. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా తట్టుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లాను. పాఠశాల ప్రారంభం రోజున సంతోషంగా వెళ్లినా మధ్యలో తరగతులకు హాజరు కాకపోతే నాన్న మౌలానా మందలించేవారు. వినకపోతే దండించి మరీ పాఠశాలకు తీసుకెళ్లి దిగబెట్టేవారు. అప్పట్లో ఉదయమే స్కూల్‌కు వెళ్తూ మధ్యాహ్నానికి భోజనం కూడా తీసుకెళ్లేవాళ్లం. అక్కడే స్నేహితులతో కలిసి భోజనం చేసిన జ్ఞాపకాలు ఇంకా చెదిరిపోలేదు. ఎంతో సంతోషంగా సాగిన ఆనాటి రోజులు మళ్లీ తిరిగి రావు.

– ఎం.ఏ.రహమాన్, ఏసీపీ, వైరా

భయంతో వెళ్లేవాడిని...



బోనకల్: మా స్వగ్రామం బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల. 1 – 10వ తరగతి వరకు ముష్టికుంట్ల ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. ఆతర్వాత ఉన్నత చదువులు పూర్తిచేసి తొలుత ఎంపీడీఓగా ఉద్యోగం సాధించా. తొలినాళ్లలో బడికి వెళ్లాలంటే భయం ఉండేది. ఉపాధ్యాయులు బయట కనిపిస్తే దాక్కునే వాళ్లం. వేసవి సెలవులు పూర్తవుతున్నాయంటే భయం మొదలయ్యేది. సెలవు అనంతరం తొలిరోజు స్కూల్‌కు భయంగానే వెళ్లేవాళ్లం. అప్పట్లో రోజువారీ పాఠాలు చెప్పాక మరుసటి రోజు ప్రశ్నలు వేసేవాళ్లు. దీంతో ఏం ప్రశ్న అడుగుతారనే భయంతో శ్రద్ధగా చదివేవాళ్లం. అప్పటి టీచర్ – విద్యార్థి మధ్య అనుబంధం ఇంకా జ్ఞాపకం ఉంది.

– ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఏదులాపురం

గురువుల ప్రోత్సాహంతో..



సత్తుపల్లి: మా స్వగ్రామం నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల. నాలుగో తరగతి తర్వాత మేనమామలు అశోక్, రాజబాబు తీసుకెళ్లి సూర్యాపేట జిల్లా ఎండపల్లి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చేర్పించారు. అప్పట్లో చదవకపోతే జీతానికి పెట్టేవారు. సెలవులు అయిపోతున్నాయంటే ఆటలు ఉండవని అనిపించేది. సెలవుల్లో అమ్మమ్మ ఊరైన రత్నపురం వెళ్లేవాడిని. ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, సత్తిరెడ్డి ప్రోత్సాహంతో పదో తరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యా. ఇంటర్ సూర్యాపేట, డిగ్రీ నల్లగొండ ప్రభుత్వ కళాశాలల్లో చదివాక పీజీ, బీఈడీ పూర్తిచేశా. ఆపై నకిరేకల్ పంచాయతీ ఈఓగా పనిచేస్తూ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యా.

– కొండ్రు నర్సింహ, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్

పండుగ వాతావరణం..



ఖమ్మంరూరల్: నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండా మా స్వగ్రామం. సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభానికి ముందు రోజే పండుగ వాతావరణం ఉండేది. స్నేహితులమంతా కలిసి ముందు రోజే పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో పాటు శుభ్రం చేసుకునే వాళ్లం. ఇందులో చిన్నాపెద్ద తారతమ్యాలు ఉండేవి కావు. మా పాఠశాల అనే భావనతో సుందరంగా తీర్చిదిద్దుకునే వాళ్లం. తొలిరోజు పాఠశాలకు భయంతో కాకుండా చదువుకోవాలనే ఆసక్తితో వెళ్లేవాడిని. ప్రాథమిక దశలో పునాదితోనే ఈ స్థాయికి చేరాను. పాఠశాల రోజులు, ఆనాటి గురువులు, నాతో పాటు చదివిన స్నేహితులను మరువలేను.

– తేజావత్ రాందాస్‌నాయక్, అడిషనల్ డీసీపీ, హైదరాబాద్

పోదాం పద.. బడికి!



మామిడి తోరణాలు కట్టిన నయాబజార్ పాఠశాల



పంపిణీకి సిద్ధంగా ఉన్న యూనిఫామ్

- నేటి నుంచి కొత్త విద్యాసంవత్సరం
- ముస్తాబైన ప్రభుత్వ పాఠశాలలు
- తొలిరోజే యూనిఫామ్, పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: నెలన్నర పాటు వేసవి సెలవుల అనంతరం కొత్త విద్యాసంవత్సరం గురువారం మొదలుకానుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇన్నాళ్లు సరదాగా గడిపిన పిల్లలు ఇకపై బడిబాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలలను పండుగ వాతావరణంలో ప్రారంభించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

అంతా రెడీ...

జిల్లాలో 1,241 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పీఎస్‌లు 813, యూపీఎస్‌లు 200, హైస్కూళ్లు 228 ఉండగా అన్నింట్లో కలిపి 62,908 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడడమే కాక డిజిటల్ బోధన సమకూరిన నేపథ్యాన ప్రవేశాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పర్యవేక్షణలో నిర్వహించిన బడిబాటతో చాలాచోట్ల ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వం పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు స్వాగతం పలకాలని సూచించడంతో మామిడి తోరణాలు, పూలమాలలతో అలంకరిస్తున్నారు. అంతేకాక పారిశుద్ధ్య కార్మికులతో పాఠశాలల ఆవరణ, తరగతి గదులు, తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించారు.

తెరుచుకుంటున్న పాఠశాలలు

విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలను తెరిపించేలా అధికారులు దృష్టి సారించారు. కల్లూరు మండలంలోని ఓబుల్‌రావు బంజర పీఎస్, లక్ష్మీపురం, పాయపూర్ పాఠశాలలను బుధవారం ప్రారంభించారు. రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్ పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు.

యూనిఫామ్, పుస్తకాలు సిద్ధం

మొదటి రోజే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లా విద్యార్థులకు అన్ని టైటిళ్లు కలిపి 6,59,570 పాఠ్యపుస్తకాలు, పార్ట్ –1లో 4,92,970 పుస్తకాలు అవసరముంది. ఇప్పటి వరకు చేరిన 4,46,410 పుస్తకాలను స్కూళ్లకు చేర్చారు. ఇక యూనిఫామ్ ఒక జత అందించనున్నారు. అంతేకాక మొదటి రోజు నుంచే మధ్యాహ్న భోజనం కూడా సమకూర్చనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం...



జిల్లాలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పాఠశాలల వారీగా విద్యార్థులకు అందించేందుకు పాఠ్య, నోట్ పుస్తకాలే కాక యూనిఫామ్ పంపించాం. అంతేకాక పండుగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేలా మామిడి తోరణాలు, పూలమాలలతో ముస్తాబు చేస్తున్నాం.

– సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి

చివరి ఆయకట్టుకు సైతం సాగునీరు

- ప్రతీ ఆవాసానికి తాగునీరు అందించాలి
- కేంద్ర ప్రభుత్వ అధికారి సంజీత్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ ప్రాజెక్టులు, సాగునీరు వనరులను మంగళవారం పరిశీలించిన ఆయన బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై సాగునీటి, మిషన్ భగీరథ ప్రాజెక్టుల పనితీరు, నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. తొలుత అదనపు కలెక్టర్ శ్రీజ జిల్లాలోని పథకాల పురోగతి, నిర్వహణ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

నీటి నాణ్యత భేష్

జాయింట్ సెక్రటరీ సంజీత్ మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధిచేసిన తాగునీరు అందిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ విషయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని అభినందించారు. అయితే, ఇంకా ఎక్కడైనా పైపులైన్లు అవసరముంటే వేసి అన్ని ఆవాసాలకు నీరు సరఫరా చేయాలని తెలిపారు. అలాగే, నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులు ఉంటే అవి పూర్తి చేసేలా కేంద్రం నుంచి సహకరిస్తామని, ఇందుకోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 7.70 లక్షల వ్యవసాయ భూమికి గాను 4.5 లక్షల ఎకరాల ఆయకట్టుప్రాజెక్టుల కింద ఉందని తెలిపారు. సన్న రకం ధాన్యానికి రాష్ట్రప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో పంట సాగు పెరుగుతోందని, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం సైతం పెరిగిందని చెప్పారు. కాగా, మిషన్ భగీరథ ద్వారా అవసరం మేర తాగునీటి సరఫరా చేయలేని ప్రాంతాలకు స్థానికంగా నీరు అందిస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో వివిధ శాఖల అధికారులు టి.మాధవ్, రూపేష్, డీ.వీ.రమేష్ బాబు, ఎస్.శివధర్మ తేజ, శేఖర్‌రెడ్డి, దీక్షారైనా, సన్యాసయ్య, ఆశాలత, డి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు కలిసొచ్చిన వర్షం

- అత్యధికంగా తల్లాడలో 59.6 మి.మీ. వర్షపాతం
- ఊపందుకోనున్న వ్యవసాయ పనులు

ఖమ్మంవ్యవసాయం: ఏరువాకకు వరుణుడు తోడ్పాటునిచ్చాడు. ఏరువాక పౌర్ణమిని బుధవారం జరుపుకునేందుకు రైతులు సిద్ధమవుతుండగా మంగళవారం అర్ధరాత్రి నుంచి జిల్లా అంతటా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఏరువాక రోజునే వర్షం కురవడం పంటల సాగుకు అనుకూలంగా మారనుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం తల్లాడ మండలంలో అత్యధికంగా 59.6 మి.మీల వర్షపాతం నమోదైంది. అలాగే, కొణిజర్లలో 40.2, పెనుబల్లిలో 38.4, ఎర్రుపాలెంలో 36.8, వైరాలో 36.4, ఏన్కూరులో 32.4, మధిర 29.0, వేంసూరులో 23.6, బోనకల్ 22.4, రఘునాథపాలెంలో 20.4, చింతకానిలో 17.2, ఖమ్మం రూరల్‌లో 16.2, సత్తుపల్లిలో 14.6, ముదిగొండలో 13.6, కామేపల్లిలో 13.2, కూసుమంచి, నేలకొండపల్లిలో 11.6, కల్లూరులో 10.2, కారేపల్లిలో 9.8, తిరుమలాయపాలెంలో 8.6, ఖమ్మం అర్బన్‌లో 8.4 జిల్లా మొత్తంలో 474.2 మి.మీల వర్షపాతం నమోదైందని వెల్లడించారు.

వ్యవసాయ పనులకు ప్రయోజనం


మే చివరి వారం తర్వాత మళ్లీ మంగళవారమే ఓ మోస్తరు వర్షం కురిసింది. గతనెలలో కురిసిన వర్షాలతో రైతులు దుక్కులు దున్నగా, ఆతర్వాత వరుణుడు ముఖం చాటేయడమే కాక ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో రైతులు విత్తనాలు వేసేందుకు ఎదురుచూశారు. ఇంతలోనే బుధవారం కురిసిన వర్షం వ్యవసాయ పనులకు ప్రయోజనం కలిగిస్తుందని చెబుతున్నారు. అయితే, పత్తి, అపరాలు వంటి మెట్ట పైర్లు వేయడానికి 60 – 70 మి.మీల వర్షపాతం నమోదు కావాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అయినా కొందరు రైతులు ఇప్పటికే పత్తి విత్తనాలను నాటగా, తాజా వర్షంతో మొలకెత్తనున్నాయి.



రైతులతో కలిసి పత్తి విత్తనాలు నాటుతున్న డీఏఓ పుల్లయ్య

కూసుమంచి: కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి డి. పుల్లయ్య బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా లోక్యాతండా రైతులు పత్తి విత్తనాలు నాటుతుండగా ఏడీఏ సరిత, ఏఓ వాణి, ఏఈఓలతో కలిసి ఆయన కూడా నాటారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ భూమిలో తగిన పదును వచ్చాకే విత్తనాలు వేస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. తొలుత కూసుమంచిలోని పలు విత్తన దుకాణాలను ఎస్సై నాగరాజుతో కలిసి డీఏఓ తనిఖీ చేశారు.

విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు దిక్సూచి... మన విద్యాలయాలు







ఒత్తిడి లేని విద్య.. న్యూ టైనిటాట్స్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం బస్‌డిపో రోడ్డులోని న్యూ టైనిటాట్స్ హైస్కూల్‌లో ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్యనందిస్తున్నామని కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. 26ఏళ్లుగా ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందిస్తుండగా ర్యాంకులు, గ్రేడ్లతో ముందంజలో ఉన్నారని తెలిపారు. పిల్లలకు మానసిక వికాసంతోపాటు నైతిక విలువలు నేర్పిస్తున్నామని, యాజమాన్యం , ఉపాధ్యాయుల కృషితో ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. ఈ విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ప్రత్యేక బోధన.. క్రియేటివ్

ఖమ్మం శ్రీటౌన్ ప్రాంతంలోని క్రియేటివ్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నట్లు కరస్పాండెంట్ బిజ్జాల కమలాకర్, డైరెక్టర్ కౌషిక్ తెలిపారు. ఈసారి ఏసీ ప్రీ ప్రైమరీ తరగతులను కల్పవృక్ష ప్రోగ్రామ్‌తో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్లే బేస్డ్ లెర్నింగ్, థీమ్ బేస్డ్ యాక్టివిటీస్, లాంగ్వేజ్ స్కిల్స్, న్యూమరసీ స్కిల్స్, సెన్సోరియల్ యాక్టివిటీస్‌తో కరిక్యులమ్ ఉంటుందని, ప్రైమరీ, హైస్కూల్ తరగతులకు కోడింగ్, రోబోటిక్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతిలో తమ విద్యార్థులు 573, 572 మార్కులతో పాటు ముగ్గురు 565 మార్కులు సాధించారని తెలిపారు.

47ఏళ్ల చరిత్ర.. నిర్మల్ హృదయ్

గత 47 ఏళ్లుగా ఖమ్మం ఎన్‌ఎస్‌టీ రోడ్డులోనినిర్మల్ హృదయ్ పాఠశాలలో ఉత్తమ బోధనందిస్తూ ప్రజల మన్ననలు పొందామని కరస్పాండెంట్ వంగా సాంబశివరెడ్డి పేర్కొన్నారు. పదో తరగతిలో లక్ష్మి నివేదిత 581, ఎండి.రియా 579 మార్కులు సాధించారన్నారు. ప్రీ ప్రైమరీ నుంచే డిజిటల్ క్లాస్‌లు బోధిస్తుండగా, ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ అందిస్తున్నామని వివరించారు. అలాగే, గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ఉన్నాయని తెలిపారు. పిల్లల్లో సృజనాత్మకత వెలికితీత, పోటీతత్వం పెంచుతూ సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఉత్తమ బోధన.. ఆక్స్‌ఫర్డ్

ఖమ్మం స్టేషన్ రోడ్డులోని తమ పాఠశాలలో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నామని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ జాఫర్ మతిన్ తెలిపారు. అన్ని సదుపాయాలతో ఉత్తమ విద్య అందుబాటులో ఉందని, ఒత్తిడికి దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన సాగుతోందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్త భవనంలో తరగతులు ప్రారంభిస్తున్నామని వివరించారు. పదో తరగతిలో సుధా సాయి మణికంఠ 584, చందన విష్ణుష్ 580, షేక్ రిమ్‌షా మెహవీష్ 565 మార్కులు సాధించినట్లు వివరించారు.

నాణ్యమైన విద్య.. గూగుల్‌కిడ్స్

ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని గూగుల్ కిడ్స్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రిన్సిపాల్ ఏ.కృష్ణప్రసాద్ తెలిపారు. నూతన విద్యా ప్రమాణాలతో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన సాగుతోందని వెల్లడించారు. తరగతి గదుల్లో పరిమిత సంఖ్యలో విద్యార్థులు ఉండటంతో ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ప్రతీ క్లాస్‌రూమ్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. పాఠాలతో పాటు నృత్యాలు, కరాటే, ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్ ఉంటాయని ఆయన వెల్లడించారు.

వంద శాతం ఫలితాలు.. మై స్కూల్

నాణ్యమైన ఒత్తిడి లేని విద్యనందించేందుకు మైస్కూల్ అహర్నిశలు పాటుపడుతోందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. మంచి విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తూ ఉత్సాహ వాతావరణంలో చదువు నేర్చుకునే సదుపాయం కల్పించామని తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి తావివ్వకుండా ఆటపాటలతో విద్యాబోధన సాగుతుందని చెప్పారు. పదో తరగతిలో తమ విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని వివరించారు. ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని తెలిపారు.

వ్యక్తిగత శ్రద్ధ.. వికాస్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్ళేందుకు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో విద్యాబోధన చేస్తున్నామని వికాస్ స్కూల్ కరస్పాండెంట్ వై.లావణ్య పేర్కొన్నారు. నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే సాంకేతిక విద్యపై ఆసక్తి పెంచేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. థీమ్ కాన్సెప్ట్‌తో బోధన చేపడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు.

విద్యారత్నం.. భరత్

మధిర: మధిరలో 1993లో స్థాపించిన భరత్ విద్యాసంస్థల్లో చదువు పూర్తిచేసిన ఎందరో దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని కరస్పాండెంట్ శీలం విద్యాలత, డైరెక్టర్ శీలం వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎస్సెస్సీలో ఏటా తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. ఇటీవల తమ పూర్వ విద్యార్థి ఆలపాటి గోపీనాథ్ ఐఎఫ్‌ఎస్‌గా ఎంపికయ్యాడని తెలిపారు. టీజీ ఆర్‌జేసీలో ఎన్.దేవర్ష రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించగా, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, సీహెచ్.శైలేష్ 16, 32 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. మధుర డివిజన్ ఎస్సెస్సీ టాపర్లుగా నిలిచిన తమ విద్యార్థులు 579, 578 మార్కులు సాధించగా, 550కి పైగా 20 మంది, 500కు పైగా మార్కులు 45 మంది సాధించారని తెలిపారు.

దిక్సూచి.. షైన్

బోనకల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తూ దిక్సూచిలా నిలుస్తున్నామని షైన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ షేక్ అన్సర్‌పాషా తెలిపారు. సువిశాలమైన క్యాంపస్, ఆహ్లాదకరమైన వాతావరణం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఎందరినో ఉన్నత స్థాయికి చేర్చిన ఘనత తమకు ఉందని తెలిపారు. ఎస్సెస్సీ ఫలితాల్లో తమ విద్యార్థి ఎం.సాయిహర్షిణి 568 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన వెల్లడించారు.

నర్సింగ్ విద్యకు కేరాఫ్.. అరోరా

పాల్వంచ: అందరికీ అందుబాటులో ఉండేలా నర్సింగ్ విద్యను అందుబాటులో తీసుకొచ్చామని అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల చైర్మన్ తాళ్లూరి హరిబాబు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. తమ సేవలకు ఫలితంగా ఇటీవల డాక్టరేట్ పురస్కారం లభించిందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో ముఖ్యపాత్ర పోషించే నర్సింగ్ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. అత్యాధునిక ల్యాబ్‌లతో జీఎన్‌ఎం(జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ) కోర్సు ఉందని, ఈ కోర్సు పూర్తిచేస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు.

విద్యాకుసుమం.. లిటిల్ ఫ్లవర్స్

భద్రాచలంటౌన్: విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేలా లిటిల్ ఫ్లవర్స్ స్కూల్, కళాశాలలు పట్టుగొమ్మల్లా నిలుస్తున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, మాగంటి రమేష్‌బాబు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గత 46 ఏళ్లుగా ఉత్తమ విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాగంటి సూర్యం స్ఫూర్తిని ప్రస్తుతం తాము కొనసాగిస్తున్నామని వివరించారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఏటా ఎన్నో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని, ఉత్తమ బోధన అందిస్తున్నామనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

విద్యలో మేటి.. మాంటిస్సోరి

మణుగూరు టౌన్: ఏజెన్సీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని మమణుగూరులోని శ్రీ సత్యభాస్కర హైస్కూల్, మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్ నిర్వాహకులు తెలిపారు. కేరళ, మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు, డిజిటల్ ల్యాబ్, ఆధునాతన తరగతి గదులతో బోధన సాగుతుండగా, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయి మొదటి, రెండు ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.

సంపూర్ణ విద్య.. విద్యాక్షేత్ర

ఖమ్మంలోని విద్యాక్షేత్ర పాఠశాల అనుభూతి ఆధారిత, సాంస్కృతికంగానే కాక సంపూర్ణ విద్యకు నిదర్శనంగా నిలుస్తోందని కరస్పాండెంట్ సౌభాగ్య తెలిపారు. ఆధునిక విద్యను సంప్రదాయ కళలు, హస్తకళలు, వ్యవసాయం, తల్లిదండ్రులు–గురువుల మధ్య పరస్పర సహకారంతో మిళితం చేశామని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకత, కరుణ, ఆత్మవిశ్వాసం కలిగిన సమగ్ర వ్యక్తిత్వాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె తెలిపారు. విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వంతో తీర్చిదిద్దే మహోన్నత కార్యానికి శ్రీకారం చుట్టామని సౌభాగ్య వివరించారు.















Padmaja ads:8008288630







టీజీఏఎన్‌బీ-'మా' సహకారంతో 'ఆపరేషన్ సంకల్ప్'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో 'ఆపరేషన్ సంకల్ప్' అధికారికంగా ప్రారంభించారు. ఇది తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, సివిల్ ఫోర్స్ ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టిన వినూత్న కార్యక్రమమని టీజీఏఎన్‌బీ తెలిపింది. టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మాదాల రవి, టీజీఏఎన్‌బీ ఎస్పీ పి.సీతారామ, డిపార్ట్‌మెంట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ డైరెక్టర్ శైలజ తదితరులు హాజరయ్యారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే తమ లక్ష్యం దిశగా ఇది ఒక శక్తివంతమైన అడుగు అని వారు పేర్కొన్నారు.

25న పోలవరంపై ప్రధాని 'ప్రగతి' సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ నెల 25న ప్రత్యేకంగా ప్రగతి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణతోపాటు సంబంధిత రాష్ట్రాలకు తాజాగా కేంద్రం సమాచారాన్ని అందించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఏపీ సర్కారుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే పోలవరం ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం మేరకు నీళ్లను నిల్వ చేస్తే తమ రాష్ట్రాల్లో ఏర్పడనున్న ముంపు సమస్యను పరిష్కరించాలని, భూసేకరణతో పాటు పరిహారం చెల్లించాలని, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని తెలంగాణతో సహా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతో ప్రధాని మోదీ గత నెల 28న ఈ ప్రాజెక్టుపై ప్రగతి సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అప్పట్లో వాయిదా పడింది. తాజాగా ఈ నెల 25న నిర్వహించనున్నట్టు కేంద్రం తెలిపింది.

పాతికేళ్లకు వృద్ధ భారతం!

▶ మొదటి పేజీ తరువాయి

రెట్టింపునకు మించి 34.7 కోట్లకు (జనాభాలో 20.8 శాతం) చేరుకుంటుందని అంచనా. ఇది దేశ ఆరోగ్య, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఇప్పటికే దేశంలో ఆర్థిక అభద్రత, కుటుంబపరమైన సహాయ సహకార వ్యవస్థ క్షీణత, వైద్య, ఆరోగ్య సేవల విషయంలో అసమానతల పెరుగుదల లాంటి తదితర కారణాల వల్ల వృద్ధుల సంఖ్య పెరుగుదల అనేది ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక అంశాలను ప్రభావితం చేస్తుండటం చర్చనీయాంశంగా ఉంది. భారత్ క్రమంగా వృద్ధ సమాజంగా మారనున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇది ఒక సంక్షోభంగా పరిణమించవచ్చుననే హెచ్చరికలు కూడా ఈ సందర్భంగా వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన 'ఇండియాస్ ఏజింగ్ సొసైటీ: ద ల్యాండ్ స్కేప్ టుడే'– గివ్ గ్రాంట్స్ ఇండియా' నివేదిక'లో ఇందుకు సంబంధించిన అనేక అంశాలు వెల్లడయ్యాయి. ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 (యూఎన్ఎఫ్‌పీఏ ఇండియా, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సంయుక్త పరిశీలన), కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, నీతి ఆయోగ్ పరిశోధనల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

29 శాతం మందికే పెన్షన్


పెన్షన్ అందని వృద్ధుల బతుకు భారంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలోని వృద్ధులలో 29% మందికే పెన్షన్ (వివిధ రూపాల్లో) లభిస్తోంది. దాదాపు 40% మంది వృద్ధులు అత్యల్ప ఆదాయ వర్గ కుటుంబాలకు చెందినవారు. వారి జీవితం.. భద్రమైన ఆదాయం, కుటుంబ మద్దతు తగ్గిపోతున్న ఈ కాలంలో మరింత కష్టతరంగా మారుతోంది. వృద్ధులపై జరిగే దౌర్జన్యాలలో 71% కేసులు మహిళలకు సంబంధించి ఉంటున్నాయి. దేశంలోని సగానికి పైగా వృద్ధులు మొబైల్ ఫోన్లు లేదా ఇంటర్నెట్ ఉపయోగించలేరు. ఇది వారిని సమాజం నుంచి పూర్తిగా వేరుచేస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,000కు పైగా మాత్రమే వృద్ధుల వసతి గృహాలున్నాయి.

దెబ్బతీస్తున్న దీర్ఘకాలిక వ్యాధులు...

ప్రస్తుతంవృద్ధులలో..50% మందికి అధిక రక్తపోటు, 43% మందికి మధుమేహం (డయాబెటిస్) 33% మందికి ఆస్తమా వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరమయ్యే పరిస్థితులు. కానీ దేశవ్యాప్తంగా తక్కువ సంఖ్యలో మాత్రమే గెరియాట్రిక్ వైద్య నిపుణులున్నారు. పౌర ఆరోగ్య బీమా పథకం ద్వారా 25% వృద్ధులకు మాత్రమే బీమా లభిస్తోంది.

వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు

అటల్ వయో అభ్యుదయ యోజన, జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం, రాష్ట్రీయ వయోశ్రీ పథకం. అయితే వీటిపై ప్రజల్లో అవగాహన లోపం, ఇవి సరిగా అమలు కాకపోవడం, గ్రామీణ ప్రాంతాలకు చేరిక తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి.



ఏం చేయాలి?

పెన్షన్ వ్యవస్థను విస్తరించాలి. అసంఘటిత రంగం వృద్ధులకు కూడా చేరుకునేలా చూడాలి. అత్యాధునిక వృద్ధుల నివాస గృహాలు స్థాపించాలి. సహాయ జీవన, ఆరోగ్య ఆధారిత సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జీరో టాలరెన్స్ పథకం – వృద్ధులపై దౌర్జన్యాలపై కఠినచర్యలు. డిజిటల్ సహిత వృద్ధులు – డిజిటల్ సాంకేతికతపై శిక్షణ. వృద్ధ మహిళల ప్రత్యేక పథకాల కు, ఆర్థిక స్వయం సాధన, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి.

తొలగించిన కులాలపై ముగిసిన విచారణ

- ప్రభుత్వానికి త్వరలో బీసీ కమిషన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ జాబితా నుంచి గతంలో తొలగించిన కులాల చేర్పునకు సంబంధించి బీసీ కమిషన్ బహిరంగ విచారణ బుధవారంతో ముగిసింది. మూడురోజుల పాటు జరిగిన ఈ విచారణలో మొత్తం 133 గ్రూపులతో కమిషన్ మాట్లాడింది. బుధవారం జరిగిన విచారణలో 64 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, రంగు బాలలక్ష్మి, ఇతర అధికారులు ఈ విచారణలో వచ్చిన వినతులు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత తెలంగాణ రాష్ట్ర బీసీ కుల జాబితానుంచి 26 కులాలు తొలగించారు. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని కులాలు కావడం, తెలంగాణలో ఆయా కులాలు స్థానికంగా లేకపోవడంతో అప్పట్లో వాటిని తొలగించారు. అయితే ఈ కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని కమిషన్‌కు వినతులు రావడంతో ఈ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ త్వరలో ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

కూకట్‌పల్లిలో హాట్‌కేకుల్లా..

గజం భూమి ధర రూ.2.98 లక్షలు
- కేపీహెచ్‌బీ కాలనీ స్థలాలకు భారీ స్పందన
- రూ.141.36 కోట్లు పలికిన 18 ప్లాట్‌లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలాలకు బుధవారం ఏర్పాటు చేసిన వేలం పాటలో భారీ స్పందన లభించింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని 7వ ఫేజ్‌లోని 18 ప్లాట్లను వేలం వేయగా అన్ని ప్లాట్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోయాయి. 7వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ 22ను అత్యధికంగా గజానికి రూ.2.98 లక్షల చొప్పున దక్కించుకున్నారు. 151 గజాలున్న ఈ ప్లాట్ 4 కోట్ల 52 లక్షల 72 వేల 160 రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అదే విధంగా 292 గజాలు ఉన్న 19వ నంబర్ ప్లాట్ గజానికి రూ.2.88 లక్షల చొప్పున వేలకు వేలం పాడారు. ఈ ప్లాట్ నుంచి 8 కోట్ల 40 లక్షల 96 వేల రూపాయలు వచ్చాయి. ఇక్కడ ఉన్న మొత్తం 18 ప్లాట్‌లలోని 6,236.33 గజాలకు కలిపి 141 కోట్ల 36 లక్షల 89 వేల 100 రూపాయల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

వానలకు అనుకూలంగా వాతావరణం

▶ మొదటి పేజీ తరువాయి

మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. వికారాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మాటూర్‌లో 4.93 సెం.మీ. వర్షం

బుధవారం రాష్ట్రంలో సగటున 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో 11 రోజుల్లో 3.37 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. బుధవారం సాయంత్రానికి 2.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా మాటూర్‌లో 4.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లిలో 4.35, నల్లగొండ జిల్లా ముదిగొండలో 3.38, పడమటిపల్లెలో 3.10, తిమ్మాపూర్‌లో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

- ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి
- కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్‌కౌశిక్, వేణుయాదవ్, వరలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ బీసీ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకోవాలని ఆర్.కృష్ణయ్యకు హితవు చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో విడుదల చేయకపోతే గాంధీభవన్‌ను ముట్టడిస్తామని బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్ కౌశిక్, వేణుయాదవ్, మచ్చ వరలక్ష్మిలు మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ఈ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ చిత్తశుద్ధితో బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కానీ ఈ విషయంలో ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి అని, బీజేపీలో ఉండి ఆయన బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక జీవో విడుదల చేయాలని ఆర్.కృష్ణయ్య మాట్లాడుతున్నారని, ఆ జీవోను కోర్టు కొట్టి వేస్తే, బీజేపీ ఎంపీగా ఉన్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్ల గురించి కేంద్రంతో మాట్లాడి 9వ షెడ్యూల్‌లో పెట్టిస్తారా? అని సవాల్ చేశారు. 40 ఏళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్లను ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించిందని, ఈ విషయాన్ని కృష్ణయ్య ఒప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్‌ఎల్‌బీసీ పనులపై ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే

- టన్నెల్ ప్రాంతంలో నేల స్వభావాన్ని కచ్చితంగా గుర్తించే ప్రయత్నం
- రక్షణ శాఖ హెలికాప్టర్లతో సర్వే నిర్వహిస్తాం: మంత్రి ఉత్తమ్


వీరేంద్ర తివారీతో చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టన్నెల్ ప్రాంతంలోని నేల స్వభావాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు ప్రత్యేక హెలికాప్టర్లతో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే చేయించాలని నిర్ణయించింది. అందుకోసం తక్కువ ఎత్తులో ఎగిరే సామర్థ్యం గల రక్షణ శాఖకు చెందిన రెండు హెలికాప్టర్లు వినియోగించనున్నారు. సర్వే పరికరాలను డెన్మార్క్ నుంచి ప్రత్యేకంగా తెప్పించనున్నారు. ఈ సర్వేపై బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సీఈ అజయ్‌కుమార్‌లు నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ వీరేంద్ర తివారీ, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ డీజీగా పనిచేసిన హర్‌పాల్‌సింగ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రాలతో విడివిడిగా భేటీ అయ్యారు. టన్నెల్ పునరుద్ధరణ, సర్వే, నిర్మాణ పనులపై వారితో చర్చించారు. సర్వే కోసం రెండు ప్రత్యేక హెలికాప్టర్లను ఇవ్వాలని కోరగా, రక్షణ శాఖ అధికారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. ఎలక్ట్రో మ్యాగ్నటిక్ పరికరాలతో జరిపే సర్వే భూ ఉపరితలం నుంచి ఒక కిలోమీటర్ లోతు వరకు నేల స్వభావంతో పాటు ఇతర సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా నిర్మాణ పనులు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. జూలై 12న సర్వే మొదలై వారం రోజుల్లో పూర్తవుతుందని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో టన్నెల్ పనులను పూర్తిచేసి కృష్ణా జలాలను గ్రావిటీ ద్వారా నల్లగొండ జిల్లాకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. టన్నెల్ పనుల పూర్తికోసం కల్నల్ పరీక్షిత్ మెహ్రా డిప్యూటేషన్‌పై రెండేళ్లపాటు సాగునీటి శాఖలో స్పెషల్ సెక్రటరీ హోదాలో పనిచేస్తారని చెప్పారు. టన్నెల్ తవ్వకాల్లో అపార అనుభవం ఉన్న జనరల్ హర్పాల్ సింగ్ తెలంగాణ ప్రభుత్వానికి జీతం తీసుకోకుండా గౌరవ సలహాదారుగా సేవలు అందిస్తారని వివరించారు.

ఎరువులు, విత్తనాల విషయంలో అప్రమత్తత అవసరం: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: కేటాయించిన లక్ష్యానికన్నా తక్కువ మొత్తంలో సరఫరా చేసిన యూరియా, ఇతర ఎరువులను జూలైలోగా సరఫరా చేయాలని ఎరువుల కంపెనీల ప్రతినిధులను వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సచివాలయంలో అధికారులు, ఎరువుల కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జూన్‌కు కేటాయించిన 1.70 లక్షల మెట్రిక్ టన్నులతో పాటు ఇప్పటివరకు తక్కువగా సరఫరా చేసిన 1.21 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను జూలైలోగా సరఫరా చేయాలన్నారు. కేటాయించిన ఎరువులను సరఫరా చేయకపోతే ఆయా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరి సాగుకు ఈసారి సన్న రకాల విత్తనాలు, పౌరసరఫరాల శాఖ కొనుగోలుకు అనువుగా ఉండే విత్తనాలను రైతులకు అందించాలని మంత్రి తుమ్మల.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి సూచించారు.

జిల్లా వార్తలు

విపత్తులు ఎదుర్కోవడంపై శిక్షణ


మాట్లాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: గతేడాది మాదిరి మున్నేటి ముంపు ఎదురైతే సహాయక చర్యల్లో పాల్గొనేలా ఖమ్మంలో పలువురిని ఆపదమిత్రలుగా నియమించారు. వీరికి ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఆర్.మాధిలేటి ఆధ్వర్యాన విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, సహాయక చర్యలు చేపట్టడం, సీపీఆర్‌తో పాటు ప్రాథమిక చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు సాయినాథుడి నాణేల ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: షిర్డీ సాయినాథుడికి సంబంధించిన తొమ్మిది నాణేలను ఖమ్మం గాంధీచౌక్‌లోని సాయి మందిరంలో గురువారం ప్రదర్శించనున్నట్లు చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. షిర్డీ సాయినాథుడు భగవంతుడిని చేరేందుకు తొమ్మిది నాణేలను రూపొందించి భక్తురాలైన లక్ష్మీబాయికి అందించినట్లు నమ్మిక. ఈ నాణేలను షిర్డీలోని లక్ష్మీబాయి సమాధి వద్ద ఉంచగా, ఆమె బంధువులు దేశ వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో ప్రదర్శిస్తున్నారు. ఈమేరకు గురువారం ఖమ్మం చేరుకుంటారని వెంకటేశ్వరరావు తెలిపారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగంగా పూర్తిచేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. కామేపల్లి మండలంలోని గరిడేపల్లిలో ఇటీవల మృతి చెందిన బోడా బిబ్లి దశదినకర్మకు హాజరైన ఆయన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఈమేరకు త్వరగా పూర్తిచేసుకుంటే బిల్లులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, వెంకటనర్సయ్య, ధరావత్ రాంజీ, బానోత్ మత్రునాయక్, గుగులోత్ గోపి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంచేలా వ్యాపారం

మహిళా మార్ట్‌ను సందర్శించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


మార్ట్‌లో కొనుగోలు చేసిన వస్తువులు తీసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల్లో విశ్వాసం పెరిగేలా మహిళా సంఘాలు వ్యాపారం నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని మహిళా మార్ట్‌ను బుధవారం సందర్శించిన ఆయన నిర్వహణలో అనుభవాలు, ఇంకా ఏమైనా సాయం కావాలి అని ఆరా తీశాక మాట్లాడారు. వినియోగదారుల అవసరాలు, ఆలోచనలకు అనుగుణంగా ఉత్పత్తులు సమకూరిస్తే వ్యాపారం పెరుగుతుందని తెలిపారు. కల్తీలేని నాణ్యమైన పదార్థాలు తక్కువ ధరకు మహిళా మార్ట్‌లో లభిస్తాయనే నమ్మకం ఏర్పర్చాలని చెప్పారు. ఏమేం అమ్మాలన్న విషయాన్ని జిల్లా మహిళా సమాఖ్యలో నిర్ణయించుకుని, వచ్చే లాభాలతో వ్యాపార విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మార్ట్‌కు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్ కలెక్టరేట్ నుంచి అందిస్తామని కలెక్టర్ చెప్పారు. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ బ్యాగ్స్ మాత్రమే వాడాలని సూచించారు. అనంతరం ఆయన కొంత సామగ్రి కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించారు.

■ ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలించాక ఆయన భద్రతపై సిబ్బందికి సూచనలు చేశారు.ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీహెచ్.స్వామి, డీటీ అన్సారీ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

■ ఖమ్మంఎస్‌టౌన్: బాల కార్మికరహిత జిల్లాగా ఖమ్మంను తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఈనెల 12న బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడమే కాక బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా పని ప్రదేశం వద్ద ఎక్కువ మంది పిల్లలు ఉంటే అక్కడే పాఠశాల ఏర్పాటు చేయిస్తామన్నారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ భారతీరాణి, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, డీఎల్‌సీఓ విజయభాస్కర్‌రెడ్డి, బాలల పరిరక్షణాధికారి విష్ణువందనతో పాటు ఉదయ్‌భాస్కర్, కె.శ్రీనివాస్, రవీందర్, రాందాస్, రవిచంద్ర, సమ్రీన్ పాల్గొన్నారు.

వారి నిర్ణయం స్ఫూర్తిదాయకం

కుమార్తెను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించిన ఉపాధ్యాయ దంపతులు


పాఠశాల వద్ద కుమార్తె, ఉపాధ్యాయులతో కృష్ణ దంపతులు

ఇల్లెందురూరల్ : ఆ దంపతులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. తమ కుమార్తె ఉన్నతంగా చదువుకోవాలనే ఆకాంక్షతో గతేడాది ఖమ్మంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధిస్తారనే విశ్వాసంతో ఈ ఏడాది రెండో తరగతిలో సర్కారు బడిలో చేర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మస్సివాగు గ్రామానికి చెందిన ఊకె కృష్ణ, రామేశ్వరి దంపతులు గుండాల మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వారి కుమార్తె నమశ్విత ఖమ్మంలోని ప్రైవేట్ స్కూల్‌లో చదువుతుండగా ఈ ఏడాది బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇల్లెందు మండలంలోని ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్పొరేట్ స్కూల్‌లో చదివించే ఆర్థిక స్తోమత ఉన్నా.. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కృష్ణ – రామేశ్వరి తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ముత్తారపుకట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కబ్బాకుల రవి హర్షం వ్యక్తం చేశారు.

'రైతులను ఆందోళనకు గురిచేస్తున్న కేంద్రం'


సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రైతాంగాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. ఈ విషయాన్ని రైతాంగం గుర్తించి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం ప్రథమ సభ ఖమ్మంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. దేశ సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేలా కేంద్రప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. తద్వారా వ్యవసాయం నుంచి రైతులను దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇక ఆపరేషన్ కగార్ పేరుతో పేరుతో ఆదివాసీలను అమానుషంగా హత్య చేస్తున్నారని తెలిపారు. ఇంకా సంఘం తెలంగాణ అధ్యక్షుడు రంగయ్య, సీనియర్ నాయకుడు గుర్రం అచ్చయ్య, మలీదు నాగేశ్వరరావు, ఒగ్గు నాగిరెడ్డి మాట్లాడారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు సహా 18 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి


శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

భద్రాచలంటౌన్: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటూ అందివచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని తద్వారా ఉద్యోగాల సాధన సులువవుతుందని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ తెలిపారు. టీఎస్‌కేసీ, ఐటీసీ ప్రథం సంయుక్తంగా కళాశాలలో నిర్వహించిన ఒకేషనల్, ఎలక్ట్రికల్ నైపుణ్యాలపై 45 రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. అలాగే, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను సన్మానించారు. కాగా, భద్రాచలం ప్రభుత్వ కళాశాలలో చదివి కేయూ నుంచి రెండు బంగారు పతకాలు సాధించిన భాను ప్రనూషను సైతం ప్రిన్సిపాల్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ హవీలా, అధ్యాపకులు హిమజ, డాక్టర్ శ్రీను, డాక్టర్ నాగ సమీర, శరణ్య, నర్సింహారావు, బలరాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు మధ్యాహ్నం భోజనంలో నాణ్యత పెంచి కార్మికుల వేతనం, బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. ఇదే సమయాన ఉపాధ్యాయులు బాధ్యతగా తల్లిదండ్రులను కలిసి పిల్లలను చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజుతో పాటు ముత్తయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎస్‌జీఎఫ్


మొక్క నాటుతున్న ఎస్‌జీఎఫ్ బాధ్యులు

టేకులపల్లి: ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఎస్‌జీఎఫ్) ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యాన టేకులపల్లి మండలం బొమ్మనపల్లిలో బుధవారం హరిత హారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం హెచ్‌ఎం మంగీలాల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈకార్యక్రమంలో పాగాకు లక్ష్మి, జర్పుల పద్మ, లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, ఎం.జ్యోతిరాణి, నీరజా షారోన్, సరోజ, పార్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కూసుమంచి: కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన రైతు దుస్సా ముత్తయ్య (55) బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానిక ఏటి ఒడ్డున పొలంలో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు షాక్ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతోకేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

జారి పడిన పెయింటర్...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లా బోనకల్ వాసి, ఖమ్మం వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న పెయింటర్ గంధం వంశీ(30) బుధవారం ప్రమాదవశాత్తు జారి పడగా మృతి చెందాడు. ఇంట్లో ఆయన ఫోన్ మాట్లాడుతూ నీళ్ల గమనించక కాలు వేయడంతో జారి పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై మృతి చెందగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

ఊరు దాటించిన 'స్నాప్‌చాట్'

- వచ్చాక ముఖం చాటేసిన యువకుడు
- లైంగికదాడికి యత్నించిన మరో వ్యక్తి

రఘునాథపాలెం: స్నాప్‌చాట్ ద్వారా ఏర్పడిన పరిచయంతో ఓ వివాహిత కుమార్తెతో సహా జిల్లా దాటి రాగా.. పరిచయం ఉన్న యువకుడు ముఖం చాటేశాడు. ఈ విషయాన్ని అదునుగా తీసుకున్న ఇంకో వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఇది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన వివాహితకు స్నాప్‌చాట్ ద్వారా ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆయన ఆహ్వానంతో ఆమె నాలుగేళ్ల కుమార్తెతో కలిసి మంగళవారం రాత్రి ఖమ్మం బస్టాండ్‌కు చేరుకుంది. ఆపై యువకుడు చెప్పిన అడ్రస్ ప్రకారం రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం రాగా, యువకుడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో చేసేదేం లేక ఆమె గ్రామ బస్టాప్ వద్దే ఉండిపోయింది. ఈక్రమాన అర్ధరాత్రి 12 గంటలకు ఖమ్మం బస్టాండ్‌కు వెళ్లేందుకు యత్నిస్తుండగా ఒక ద్విచక్రవాహనదారుడు సానుభూతి చూపుతూ బైక్‌పై తీసుకెళ్లి కొద్ది దూరం వెళ్లాక రోడ్డు పక్కకు ఆపి లైంగికదాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయగా వాహనదారుడు వెలుగుమట్ల కాలనీ వైపు పారిపోయాడు. అదే సమయాన వచ్చిన ఆటో డ్రైవర్ సాయంతో బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు సీఐ తెలిపారు. వివాహితను పిలిపించింది ఎవరు, బైక్‌పై తీసుకెళ్లింది ఎవరనే కోణంలో విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.